# ఒక చిలుక కథ

''నూకలు పెడితే మేకలు కాస్తావా?''
''ఆఁ''
''పెద్ద పులి వస్తే దడవకుండా ఉంటావా?''
''ఆఁ''

ఆ వెంటనే 'ఉఫ్' మని అవతలివాడి కళ్ళల్లోకి ఊది, వాడు కళ్ళు మూయంగానే, 'మరి దడుచుకొన్నావేం?' అని వెక్కిరింతామని నా ఉద్దేశం. అసలు కథ కూడా అలానే సాగుతుంది. ఆ అభిప్రాయంతోనే బాగా గాలి పీల్చుకొని 'ఉఫ్' మని వూదాను. కున్నుగాడు కళ్ళు మూసుకోలేదు సరిగదా, కనురెప్పలను ఈపాటిగానయినా కదల్చలేదు. కాస్త దసికినా వాడు భయపడినట్లే లెక్క. అప్పుడు వాణ్ని 'మరి దడుచుకున్నావేం?' అని ఎద్దేవా చేయవచ్చు. వాడు కళ్ళు మూసుకోలేదు గనకా, కనీసం కనురెప్పలను కదిలించనన్నా కదిలించలేదు గనకా, వాణ్ని వెక్కిరించే వాక్కు నాకు లేకుండా పోయింది.

''ఇక నువ్వేం చెయ్యలేవు'' అన్నది చిలుక.

''అయితే ఇందాకణ్నించీ జరుగుతున్నదంతా నువ్వు చూస్తున్నావన్నమాట'' అన్నాను.

''నేను చూసినందుకు బాధ పడుతున్నావా? కున్నుగాణ్ని భయపెట్టలేక పోయినందుకు బాధ పడుతున్నావా? కాస్త ఆలోచిస్తే, ఈ కథకు కాలం చెల్లిందని నీకే తట్టి ఉండేది. ఈ కథ పుట్టినప్పటి పరిస్థితులు వేరు. ఆ పరిస్థితులే - శతాబ్దాలపాటు - అల్లాగే - ఒక్క పిసరు అటూఇటూ మారకుండా మొన్న మొన్నటిదాకా ఉన్నాయి. ఇప్పుడు ఆ పప్పులు ఉడకవు. ఉడికించడానికి నువ్వు ప్రయత్నం చేయడం వృథా!'' అన్నది చిలుక.

"చాలా కాలంగా చాలా మంది ఈ కథను ఇలాగే చెప్పుకుంటున్నారే!" అన్నాను నసుగుతూ.

ఈ సారి చిలుక సన్నగా నవ్వింది.

"ఒకదాని తాలూకు మంచి చెడ్డలు, 'అది ఎంతకాలం నుండి ఉన్నది?' అన్న అంశం మీదనే ఆధారపడి ఉండవు. అనేక శతాబ్దాల నుండి ఒక పొరబాటు జరుగుతూ వస్తున్నది గనుక - ఆ కారణంగానే - అది మంచిదయిపోదు. అది మంచిదవడానికి ఇతర అంశాలు కూడా జతపడాలి. మేకల్ని నువ్వెందుకు పెంచుతున్నావ్? నీ పొట్ట కోసం. కాసేవాడు ఎందుకు కాయడానికొచ్చాడు? వాడి పొట్ట కోసం. మరి పెద్ద పులి అక్కడికెందు కొస్తున్నట్టు? దాని పొట్ట కోసం. అవునా? నీ పొట్ట కోసం నువ్వు మేకల్నీ, మేకల కాపలాదారునీ సాకుతున్నావ్. ఆ మేకల కోసం పెద్ద పులి వస్తే దాన్ని చూసి దడుచుకోకుండా ఆ పెద్ద పులితో పోట్లాడగల ధైర్యశాలికి, నువ్వు 'నూకలు (మాత్రమే) పెడతావు'. ఈ మేకలు కాయడంలో ప్రమాదమున్నదని ఆ కాపలాదారుకు తెలుసు ఒకవేళ అతగాడు మరిచిపోయి ఉండవచ్చునన్న అనుమానం కొద్దీ 'పెద్ద పులి వస్తే దడవకుండా ఉంటావా?' అని కూడా నువ్వు జ్ఞాపకం చేశావు. వాడేమో 'ఆ' అనేశాడు. మేకల్ని తిని, ఆకల్ని తీర్చుకుందామని, ఆవురావురుమంటూ వచ్చే పెద్ద పులికి, మేకయినా ఒకటే, మనిషయినా ఒకటే! చీల్చుకు తినేస్తుంది. ఈ సంగతి కాపలావాడికి తెలుసు. తెలిసికూడా నువ్విచ్చే నూకల కోసం ప్రాణాలు పోగొట్టుకోడానికి సైతం వాడు సిద్ధపడ్డాడంటే, మనిషి ప్రాణానికి చారెడు నూకలకున్నపాటి విలువ కూడా లేదన్నమాటే గదా!" అన్నది చిలుక.

"పెద్ద పులి అటుకేసి రాకపోయినప్పటికీ, కాపలావాడికిస్తానన్న నూకలు ఇచ్చే తీరతాను గానీ మాట తప్పను గాక తప్పను సుమా'' అన్నాను.

"నూకలు నువ్విస్తానన్నది మేకలు కాస్తానన్నందుకూ, కాపి నందుకూను, అందులో ఒక్క మేక, పులివాత పడ్డా, నువ్వు వాడి తిత్తి తీస్తావు మేకకు బదులుగా వాడే పులినోట పడ్డా నీ కభ్యంతరం లేదు. నీకు కావలసింది నీ మేకలు క్షేమంగా ఉండడమే తప్ప, వాటి కాపలాదారు క్షేమం కాదు. నేను గట్టిగా చెప్పదలచుకొన్నదేమిటో నీకీపాటికి అర్థమయి ఉండాలే!" అన్నది చిలుక కాస్తగొంతు పెంచి.

"ఈ సమాజంలో మేక పిల్లకున్న విలువ మనిషికి లేదని చెప్పడం నీ ఉద్దేశమని నా కర్థమయింది" అన్నాను.

"నాక్కావలసింది సరిగ్గా అదే!" అన్నది చిలుక.

ఒక నిమిషంపాటు నాకు గుక్క తిరగలేదు.

"ఈ మధ్య తమ దృష్టి మేకల మీదకు ప్రసరించిందేమిటి?" అన్నాను అసలు సంగతేమిటో కనుక్కుందామని!

"అదా!" అని సాయలా, పాయలాగా నవ్వింది చిలుక.

"మీకు తెలుసునో లేదో మరి. నేనో మూణ్నెల్లపాటు 'స్వేచ్ఛా ప్రపంచం'లో తిరిగొచ్చాను" అని ప్రారంభించింది చిలుక.

"అని విన్నాను. అక్కడి సంగతులు అడుగుదా మనుకుంటూనే, వాయిదా వేసుకుంటున్నాను, నువ్వు కనపడక కొంతా, నాకు తీరిక లేక కొంతా. అక్కడ మేకలు విశేషంగా ఉన్నాయా? అందుకనే వాటిని గురించి మీరు పదే పదే -" అన్నాను.

చిలుక ఒకసారి తల విదిలించుకొంది. ముక్కుతో ముందున్న ఖాళీ గిన్నెను అటూ ఇటూ నెమరింది. సన్నగా నిట్టూర్చింది.

"ఆ మూడు మాసాలూ మూడు యుగాలుగా గడిచాయనుకో. ముందుగా ఏవేవో వూహించుకుంటూ ఆ స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగు పెట్టాను. ఆ తరువాత గానీ అదొక విష వలయమని తెలియలేదు. ఆ వలయంలో చాలా దేశాలు ఇరుక్కుని గిజగిజ

లాడిపోతున్నాయి. ఆ విషవలయం ముద్దుపేరు 'స్వేచ్ఛా ప్రపంచం', తమకేదో బ్రహ్మాండమైన స్వేచ్ఛ ఉన్నట్టూ మిగిలిన వారికి లేనట్టూ, అదే పనిగా అరిచి గావు కేకలు వేసే ఈ దేశాల్లో, చాలావాటికి నలుసంత స్వేచ్ఛ కూడా లేదు'' అన్నది చిలుక.

"అంటే - కఠిన నిర్బంధాలున్నాయనా, నీ ఉద్దేశం? ఎవరికీ ఏ పాటి స్వేచ్ఛ కూడా లేదనా నీ అభిప్రాయం?" అన్నాను.

"అలా కాదు. అక్కడ ఉండే స్వేచ్ఛ నేననుకొన్నదీ, నేను వూహించిందీ కాదు. అక్కడి ప్రజలకు గుడిసెల్లో ఉండే స్వేచ్ఛ, చెట్ల కిందా, రోడ్ల పక్కనా, తల దాచుకొనే స్వేచ్ఛా ఉన్నది, తిండికి నకనకలాడిపోయే స్వేచ్ఛ ఉన్నది. ఐదేళ్ళ లోపు పిల్లల్లో సగానికి సగం మందికి సరైన తిండిలేకా, మంచి మందుల్లేకా చచ్చిపోయే స్వేచ్ఛ ఉంది. నిరుద్యోగులుగా, గోళ్లు గిల్లుకొంటూ ఉండే స్వేచ్ఛా, రౌడీలుగానూ, గూండాలుగానూ, బతికే స్వేచ్ఛ ఉంది. అక్కడి యువకులు ముఠాలు ముఠాలుగా బయరుదేరి, పట్టపగలే దొంగతనాలు చేయడానికీ, దారి దోపిళ్ళు చేయడానికీ, బాంకులను కొల్లగొట్టడానికి స్వేచ్ఛ ఉంది. అమానుషమైన హత్యలు చేసే స్వేచ్ఛా, సామూహిక మానభంగాలు చేసే స్వేచ్ఛా, వారికున్నాయి ఆ వలయంలోని కొన్ని దేశాలవారు దొంగతనంగా ఆయుధాలను రవాణా చేస్తుంటారు. హాషిష్, హిరాయిన్, నల్లమందు, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను రహస్యంగా ఎగుమతి దిగుమతులు చేస్తుంటారు. ఈ పనులు నిస్సంకోచంగా చేయడాని కవసరమైన పాటి స్వేచ్ఛ వారికున్నది. అక్కడి ఆడవాళ్ళకు వేరే గతిలేని కారణంగా పడుపు వృత్తి చేసుకొని పొట్ట పోసుకునే స్వేచ్ఛ ఉంది. అప్పుడప్పుడే వయసులోకొస్తున్న పిల్లలు, రోడ్లవెంటా, తోటలవెంటా తిరుగుతూ దొరికినప్పుడు తింటూ, దొరకనప్పుడు చిల్లర మల్లర నేరాలు చేసి పొట్ట నింపుకొంటూ బతికే స్వేచ్ఛ ఉంది. ఇలాంటి స్వేచ్ఛలకక్కడ ఎలాంటి లోటూ లేదు, రాదు. ఈ తరహా స్వేచ్ఛలకు భంగం కలగ

కుండా, అక్కడి ప్రభుత్వాలూ, ఆ ప్రభుత్వాలను నడిపే పార్టీలూ, ఆ పార్టీలకు నిధులను సప్లయి చేసే వదాన్యులూ 'తగు జాగ్రత్తలు' తీసుకొంటూ ఉంటారు" అన్నది చిలుక.

"నేను మేకల్ని గురించి అడిగాను. నువ్వేమో స్వేచ్ఛను గురించి చెప్పుకొచ్చావు'' అని చిలుక చేసిన తప్పులు ఎత్తి చూపించాను.

"ఇప్పటిదాకా నేను చెప్పిందంతా మేకల్ని గురించే! ఈ స్వేచ్ఛ అనుభవిస్తున్న 'వారు' మేకలే! ఈ మేకల్ని శాశ్వతంగా ఇదే 'స్వేచ్ఛా ప్రపంచం' లో ఉంచడానికి, ఆ దేశాలు యథాశక్తి కృషి చేస్తున్నాయి. ఈ మేకల్లోనూ తెల్ల మేకలు వేరు, నల్లమేకలు వేరు. కావడానికి అన్నీ మేకలే అయినా అన్నిటి సమస్యలూ ఒకటే అయినా, నల్లవాటికన్నా తామే గొప్ప మేకలమని తెల్ల మేకలనుకొంటూ ఉంటాయి. తరచుగా ఈ నల్ల, తెల్ల మేకల మధ్య రక్తపాతాలు కూడా జరుగుతాయి. అప్పుడు పులులు రంగంలోకి దూకుతాయి. మేకల్ని అదుపులో పెడతాయి. తమకు అవసరమైన అన్ని రకాల అడ్డదిడ్డపు పనుల్నీ మేకలచేత చేయించుకోవడం అక్కడి పులులకు తెలుసు. అక్కడున్న పులులకూ స్వేచ్ఛ ఉంది. మేకలకూ స్వేచ్ఛ ఉంది. అయితే వాటి వాటికున్న స్వేచ్ఛల పరిమితులు మాత్రం వేరు వేరుగా ఉంటాయి. అలా ఉండడం కూడా ఒక రకంగా స్వేచ్ఛే గదా!" అన్నది చిలుక వెటకారంగా.

"వింటున్నప్పుడే నాకు సూచనగా విషయం తెలిసిపోయింది. మూడు మాసాలపాటు ఉండి, నువ్వు మరికొంత విపులంగా తెలుసుకొని ఉంటావు. నేనొప్పుకొంటున్నాను. అయితే ఈ సంగతి మేకలకింకా తెలియక పోవడం ఆశ్చర్యంగా లేదూ?'' అన్నాను.

"మేకలకు అసలేమీ తెలియకపోతే నేనూ ఆశ్చర్యపోయి ఉందును. అవి ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాయి. తెలుసుకొని ఏకమవుతున్నాయి. ఏకమయి బలం పుంజుకొంటున్నాయి. ఆ బలాన్ని

చూసే పులులు గాండ్రిస్తున్నాయి. మేకలమీద విచ్చలవిడిగా విరుచుకు పడుతున్నాయి. వాటిని నెత్తురు శేళ్ళల్లో ముంచి లేవనెత్తుతున్నాయి. కొద్దిమందికి మాత్రమే ఉన్న 'చంపే స్వేచ్ఛ'నూ, ఎక్కువ మంది ముఖాన రాసి ఉన్న 'చంపబడే స్వేచ్ఛ'నూ, నేను భరించ లేకపోయాను. మొత్తం ఆర్థిక రంగాన్ని గుప్పెట్లో ఉంచుకొన్న ఒక పుంజీడు మంది, ఏది చెబితే అది మాత్రమే వినే స్వేచ్ఛ, ఏది చేయమంటే అది మాత్రమే చేసే స్వేచ్ఛ, తప్ప – ఆ ప్రపంచంలో ఇంకేమీ లేకపోవడం, నా కాశ్చర్య మనిపించింది. ఆర్థికంగా పరాధీనత ఉన్నంతకాలం, 'స్వేచ్ఛ' అన్న మాటకు అర్థం లేదని ప్రత్యక్షంగా చూశాను. చూశాను గనకనే మళ్ళా వచ్చేశాను" అన్నది చిలుక, 'స్వేచ్ఛ' అన్న మాటమీద పదేపదే నొక్కుతూ.

"నూకలు పెడితే మేకలు కాసే కథకు కాలం చెల్లిపోయిందని నువ్వన్నప్పుడు నా కర్థం కాలేదు. ఇప్పుడు – వివరంగా చెప్పావు గనక తెలిసింది. ఇంకా మేకల్ని మేకలుగానే ఉండిపొమ్మనడం సాధ్యం కాదు. సాధ్యంకాదు కాబట్టి, ఈ కథను తప్పకుండా తిరగ రాయాలి. మేకలు కూడా మంద కడుతున్నాయిగాదా! మంద బలం చూపెడుతున్నాయి గాదా! వాటిని గురించి రాయడం న్యాయం గాదా!! ఈ పని చాలా మంచిదని నాలోంచి ఎవరో గట్టిగా చెబుతున్నారు. ఆ సత్కార్యాన్ని వాయిదా వేయకుండా ఇప్పుడే ఇక్కడే ప్రారంభిస్తాను" అన్నాను.

"నువ్వామాట నిలబెట్టుకొంటావనే విశ్వాసం నాకున్నది... నీకో సంగతి చెప్పనా? పడిపోతున్నవాడి పక్షాన నిలబడడమన్నా, పరమేశ్వరుని పక్షాన నిలబడడమన్నా నా దృష్టిలో ఒక్కటే!" అన్నది చిలుక.

అది చెప్పిందాకా నాకా సంగతి తెలియనే తెలియదు.

—:o:—